క్లుప్తంగా

పది ఫలితాల్లో పెద్దకిష్టాపురం హైస్కూల్‌లో జీరో రిజల్ట్

గార్ల: ఇటీవల ప్రకటించిన 10వ తరగతి ఫలితాల్లో మండలంలోని పెద్దకిష్టాపురం హైస్కూల్లో జీరో రిజల్ట్ రావడంతో విద్యార్థుల తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ హైస్కూల్లో 12 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయగా వీరిలో ఒక్కరూ సైతం పాస్ కాలేదు. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల్లో 90శాతం ఉపాధ్యాయులు ఖమ్మం, మహబూబాబాద్ పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తూ విద్యార్థుల విద్యపై సరైన దృష్టి సాధించలేదని తల్లితండ్రులు ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సక్రమంగా లేకపోవడంతోనే తల్లితండ్రులు తమ పిల్లలను గార్లలోని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారనే బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ప్రభుత్వ ఉపాధ్యాయులు స్థానికంగా ఉంటూ విద్యార్థుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని తల్లితండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ అభినందన

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలోని 38 మంది విద్యార్థులు 2022-23 విద్యాసంవత్సరం పదో తరగతిలో మొత్తం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా శుక్రవారం కలెక్టర్ ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



మహబూబాబాద్ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు సహకరించి సకాలంలో కొనుగోళ్లు జరపాలని పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్ అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుండా రాజశేఖర్, సర్పంచ్ సంద వీరన్న, ఏఈఓ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అవ్వా ఎట్లున్నరు?



కురవి: సీరోలు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం జరిగిన వివిధ శుభకార్యక్రమాల్లో పాల్గొని మహబూబాబాద్‌కు తిరిగి వస్తుండగా కొత్తూరు(సీ) గ్రామంలో ఓ వేప చెట్టు కింద ముసలవ్వలు కూర్చున్న విషయాన్ని గమనించిన ఎంపీ మాలోత్ కవిత కారు ఆపి వృద్ధుల వద్దకు వెళ్లి ముచ్చటించారు. అవ్వ ఎట్లున్నరు? నేను ఎవరో గుర్తుపట్టారా? పింఛన్ వస్తుందా అని ప్రశ్నించారు. బాగున్నం బిడ్డ.. పింఛన్ వస్తోంది. కంటి వెలుగులో కంటి అద్దాలు ఇచ్చింద్రు అని వృద్ధులు సమాధానం ఇచ్చారు.

17న పాలిసెట్

మహబూబాబాద్ అర్బన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ డి.రాజు శుక్రవారం తెలిపారు. ఈ నెల 17వ తేదీన మానుకోట పట్టణంలోని 8 పరీక్ష కేంద్రాల్లో 1,920మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్న 1:30గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. కాగా విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు హాజరుకావాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించమన్నారు.

పేరుకుపోతున్న ధాన్యం

- తేమ పేరుతో కొనుగోళ్లలో జాప్యం
- ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్న రైతులు



చిలుకోడు కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

డోర్నకల్: మండలంలోని చిలుకోడు, గొల్లచర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోతోంది. గత నెల 29న పీఏసీఎస్ ఆధ్వర్యంలో గొల్లచర్ల, చిలుకోడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన నాటి నుంచి రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. వర్షాలు, పొడి వాతావరణం ఉందంటూ నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో రాసులుగా పోసి వెళ్లారని, తేమ కోసం ఆరబెట్టడం లేదని వారు చెబుతున్నారు. మధ్యాహ్నం వేళ ఎండగా ఉండి రాత్రి వేళ ఉండటంతో 1 శాతం తేమ ఉండటం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. శుక్రవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభించినా ఒకరిద్దరి ధాన్యాన్నే కాంటా వేశారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటా ధాన్యాన్ని రూ.2,060కు విక్రయిస్తుండగా రైతులు ప్రైవేట్ వ్యాపారులకు రూ.1,800 విక్రయిస్తున్నారు. వ్యాపారులు డబ్బు చెల్లించేందుకు 20నుంచి నెల రోజుల వరకు గడువు పెడుతున్నారు. రైతులు వ్యాపారులకు విక్రయించడానికే మొగ్గు చూపుతున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ బంజర, వెన్నారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ కారణంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండటంతో భారీగా ధాన్యం పేరుకుపోయింది. మన్నెగూడెం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు ఏడు వేల బస్తాలను, ముల్కలపల్లి కేంద్రంలో ఓ లారీ ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు.

ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నాం..



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సకాలంలో విక్రయం జరగకపోవడంతో పలు రకాల ఇబ్బందులతో ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నాం. వర్షాలతోపాటు తేమ లేదని కొనుగోళ్లు నిలిపివేయడంతో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నాం.

– గుగులోత్ భీముడు, చాప్లాతండా, డోర్నకల్

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మరిపెడ రూరల్: పేద ప్రజలకు మెరుగైన కంటి చూపు అందించాలన్న ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రం ప్రవేశపెట్టిన కంటివెలుగు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని వీరారం రెవెన్యూ పరిధిలోని దంట్లకుంట తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ గుగులోతు అరుణ, జెడ్పీటీసీ తేజావత్ శారదలతో కలిసి చైర్మన్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు భరత్‌కుమార్, మాజీ సర్పంచ్ నర్సింగ్, నాయకులు భూక్య వెంకన్న, బానోతు పాండు, బాధావత్ వెంకన్న పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వీఆర్‌ఏల నిరసన



కేసముద్రం: ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు

కేసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమస్యలను పరిష్కరించాలంటూ వీఆర్‌ఏలు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సంఘం మండల జేఏసీ చైర్మన్ మాదారపు రమాదేవి మాట్లాడుతూ.. సెంబ్లీ సాక్షిగా వీఆర్‌ఏలకు ప్రమోషన్‌లు, పేస్కేల్, 55 సంవత్సరాలు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు అయిందన్నారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శోభారాని, విమల, సరిత, ప్రభాకర్, బుచ్చయ్య, మంగీలాల్ ల్గొన్నారు.

డోర్నకల్: తమకు పేస్కేలును అమలు చేస్తూ హామీల అమలు కోసం జీఓ విడుదల చేయాలని వీఆర్‌ఏలు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వీఆర్‌ఏలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ జేఏసీ మండల అధ్యక్షులు ఆలేటి బాలకృష్ణ, చంద్రశేఖర్, సాయిరాం, యాదగిరి, సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ: గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. దుర్గం రవీందర్ సురేష్, సుశీల, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూ పట్టా రద్దు చేయాలని డిమాండ్



ఎస్సైతో మాట్లాడుతున్న బాధితులు

నర్సింహులపేట: మాకు తెలియకుండా ఉమ్మడిగా ఉన్న భూమిని పట్టా చేశారని బాధిత రైతు దళపతి కుటుంబ సభ్యులతో శుక్రవారం అధికారులతో వాగ్వావాదం చేశాడు. శుక్రవారం కార్యాలయంలో దళపతి, అతని కుమారుడు నరేష్ విలేకరులతో మాట్లాడారు. పెద్దనాగారం శివారు వస్త్రాంతండాకు చెందిన జాటోత్ హచ్యాకు దళపతి, సీతారాం(సర్పంచ్), రవి అనే ముగ్గురు కుమారులు కలరు. వీరికి స్టేజీ సమీపంలో ఉన్న 6ఎకరాల భూమిలో రెండో కుమారుడు సీతారాం మిగతా వాళ్లకు తెలియకుండా అధికారుల అండదండలతో అతని కుమారుడు అఖిల్ పేరిట 4.32 ఎకరాలను పట్టా చేశారని ఆరోపించాడు. గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేశామన్నారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో శుక్రవారం తహసీల్దార్‌ను నిలదీశామన్నారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. దీనిపై తహసీల్దార్ వివేక్‌ను వివరణ కోరగా.. ధరణి నియమ నిబంధనల ప్రకారమే గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశామని, ఒకవేళ తండ్రి ఫిర్యాదు చేస్తే పట్టా నుంచి తొలిగిస్తామన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే నివాళి

మహబూబాబాద్ రూరల్: విద్యుదాఘాతానికి గురై మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన వరుడు భూక్య యాకుబ్ మృతిచెందాడు. శుక్రవారం ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ భూక్య మురళీనాయక్, సర్పంచ్ నివాళులర్పించారు.

క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలి

నెహ్రూసెంటర్: సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను మహబూబాబాద్ మున్సిపాలిటీ, ఎన్టీఆర్ స్టేడియంలో నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ప్రసన్నరాణి శుక్రవారం తెలిపారు. సీఎం కప్- 2023 క్రీడల్లో భాగంగా మండల స్థాయిలో ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, రాష్ట్ర స్థాయిలో 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు క్రీడలు జరుగుతాయని అన్నారు. 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వయస్సులోపు వయస్సు కలిగిన వారు అర్హులని, క్రీడాకారులకు కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

గార్ల: మండలంలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రవీందర్ తెలిపారు.

కురవి: కురవి జెడ్పీ హైస్కూల్ మైదానంలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్, ఎంపీడీఓ సరస్వతీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విజయవంతం చేయాలి

పెద్దవంగర: సీఎం క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి ఐలయ్య, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా ఏర్పాట్లను తహసీల్దార్ రమేష్, ఎస్సై రాజులతో కలిసి ఆమె పరిశీలించారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

కొత్తగూడ: మహిళా రెజ్లర్‌లను లైంగిక వేధింపులకు గురి చేస్తున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నర్సక్క డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఫ్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఇందిర, విజయ, సావిత్రి పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

గార్ల: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గార్లలో వీఓఏలు పశువులకు వినతిపత్రాలు అందజేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. 20ఏళ్ల నుంచి వెట్టిచాకిరి చేయించుకుంటూ వీఓఏలకు వేతనం నెలకు రూ.3,900 చెల్లించడం విడ్డూరంగా ఉందన్నారు. వీఓఏలు వినోద, స్వాతి, ఉమ, జ్యోతి, మనోహర్, రమ, సురేష్ పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: సీఎం కేసీఆర్ స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వీఓఏలు ఉత్తరాలు రాసి శుక్రవారం పోస్టు చేశారు. కార్యక్రమంలో కృష్ణవేణి, సుధాకర్, వీరన్న, శోభా, రోజా, రాధిక పాల్గొన్నారు. సమ్మెకు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, మహేందర్ సంఘీభావం తెలిపారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదురుగా జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె శుక్రవారం 15వ రోజుకు చేరింది. సమ్మెకు టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, భారతకార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కార్యదర్శి హలవత్ లింగన్న, జిల్లా అధ్యక్షులు పర్వత కోటేష్, తదితరులు మద్దతు తెలిపారు.

ఉత్తరాలతో సీఎంకు వినతి

గూడూరు: కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేపట్టిన వీఓఏల సమ్మె శుక్రవారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా సీఎం కేసీఆర్‌కు తెలిసేలా మండల వీఓఏలు అందరూ పోస్టుకార్డు ఉద్యమం ద్వారా వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు శ్రీలత, భారతి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

లీకేజీతో చెరువును తలపిస్తున్న కాలనీలు



లీకేజీతో కాలనీలో ఏర్పడిన మురుగు

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామంలో పైప్‌లైన్ లీకేజీతో కాలనీలు చెరువును తలపిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ శివారులో ఉన్న రక్షిత మంచినీటి బావి నుంచి ఎస్సీ కాలనీకి తాగునీరు అందించే మెయిన్ పైపులైన్ ఎరుకల కాలనీ వద్ద లీకై వేసవిలో సైతం చెరువును తలపిస్తుంది. లీకేజీతో తాగునీరు కలుషితమవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని కాలనీలకు మంచినీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరికొన్ని కాలనీలో లీకేజీతో నీరు వృథాగా పోతుందని తెలుపుతున్నారు. ఇట్టి విషయమై సర్పంచ్, కార్యదర్శులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో మంచినీటి బావికి అమర్చిన స్టార్టర్లను విద్యుత్ అధికారులు తీసుకుపోయి గ్రామానికి కొన్ని రోజులు మంచినీటి సరఫరా నిలిచిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరించి పైపులైన్ లీకేజీని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారి సూర్యనారాయణ

నెల్లికుదురు: మన ఊరు–మన బడి కార్యక్రమంలో మొదటి విడతలో ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సూర్యనారాయణ సంబంధిత అధికాలకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మన ఊరు–మనబడి కార్యక్రమంపై ఎంఈఓ గుగులోతు రాము అధ్యక్షతన హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో సూర్యనారాయణ మాట్లాడారు. కొన్ని పాఠశాలల్లో ఇప్పటి వరకు ఈజీఎస్ పనులు ప్రారంభించకపోడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైన పనులను మొదలు పెట్టి పూర్తి చేయాలని తెలిపారు. పనులు నిర్వహిస్తున్న గ్రామాలల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ పార్థసారధి, హెచ్‌ఎంలు, ప్రజాప్రతినిధులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

నర్సుల సేవలు అభినందనీయం



నెహ్రూసెంటర్: వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, నర్సులు, సిబ్బంది



గార్ల: వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, నర్సులు

నెహ్రూసెంటర్: ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సులు తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా రోగులకు సేవలు అందిస్తున్న నర్సుల సేవలు అభినందనీయమని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుల దినోత్సవం సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.వెంకట్, ఆర్‌ఎంఓ డాక్టర్ వైదేహి, వైద్యులు సుధాకర్, శ్రావణ్‌కుమార్, చింత రమేష్, వినిల్ రెడ్డి, రాజామోహన్, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: మండలంలోని ముల్కనూరు పీహెచ్‌సీలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం వేడుకలను శుక్రవారం స్టాఫ్‌నర్సులు, నర్స్‌లు ఘనంగా జరుపుకున్నారు. తొలుత నర్స్‌లు కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, అవినాష్, హెచ్‌ఎస్‌లు ఇస్మాయిల్ బేగ్, రాధాకృష్ణ, బుజ్జమ్మ, నర్సులు పార్వతి, పద్మ, సదాలి, జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మిషన్ భగీరథ నీళ్లు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్ అన్నారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన శుక్రవారం పలు వార్డుల్లో తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజారెడ్డిధర్మన్న, నవీన్, వెంకన్న, సాంబలక్ష్మీ, రవి, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన వేసవి ప్రత్యేక శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు అల్పాహారం, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ విత్తనాల సుధాకర్, శిబిరం ఇన్‌చార్జ్‌లు ఆంగోత్ లక్ష్మా, విత్తనాల సుధాకర్, డేవిడ్ పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా జిల్లా కేంద్రంలోని నందనగార్డెన్ పంప్‌హౌజ్‌కు వచ్చే నీటి సరఫరాను నేడు నిలిపివేయనున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ ప్రసన్నరాణి శుక్రవారం తెలిపారు. లీకేజీలను త్వరితగతిన పూర్తి చేసి నీటిని అందజేస్తామని తెలిపారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

డోర్నకల్: డోర్నకల్ జంక్షన్ మీదుగా నడుస్తూ కరోనా కాలంలో రద్దయిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని మాజీ డీఆర్‌యూసీసీ సభ్యులు మైనుపాషా శనివారం మైనుపాషా ఖమ్మం పార్లమెంటు సభ్యులు నామా నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందించారు.

విధుల్లో చేరుతున్న జేపీఎస్‌లు

దంతాలపల్లి: మండలంలో శుక్రవారం బొడ్లాడ గ్రామంలో జేపీఎస్ జె.విజయ్‌కుమార్ విధుల్లో చేరినట్లు ఎంపీఓ అప్సర్‌పాషా తెలిపారు.

విరాళం అందజేత

గూడూరు: మండలంలోని పొనుగోడులో బొడ్రాయి ప్రతిష్ఠాపనతోపాటు కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలకు గూడూరు సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ తన వంతు సహాయంగా రూ.10,116 విరాళంలగా శుక్రవారం గ్రామస్తులకు అందించాడు.

రూ.10వేల విరాళం

కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సువర్ణలక్ష్మీ అమ్మవారి దేవాలయానికి గాను, కేసముద్రం మార్కెట్ మాజీ డైరెక్టర్ దారావత్ రమాదేవి, రవీందర్ నాయక్ దంపతులు రూ.10వేల విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రైతు కోఆర్డినేటర్ వేం సంపత్‌రెడ్డి, వెంకన్న, వెంకటమల్లు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలో కానరాని మంత్రి పువ్వాడ ఫొటో

బయ్యారం: ఇల్లందు నియోజకవర్గ పరిధిలో ఉన్న బయ్యారంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఫ్లెక్సీపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఫొటో లేకపోవటం సర్వత్ర చర్చకు దారితీస్తుంది. మంత్రి పువ్వాడ ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ మధ్య సఖ్యత లేకపోవటం వలనే ఫొటో పెట్టలేదా అనే సందేహాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖప్రసవాలు

మరిపెడ: ప్రభుత్వాస్పత్రులలోనే సుఖప్రసవాలు జరుగుతాయని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గుగులోతు రవికుమార్ అన్నారు. పీహెచ్‌సీలో శుక్రవారం ముగ్గురికి సుఖప్రసవాలు చేసినట్లు డాక్టర్ రవి తెలిపారు. అనంతరం వారికి కేసీఆర్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణ, ఏఎన్‌ఎం సరళ, శ్రీదేవి పాల్గొన్నారు.

బీజేపేతర పార్టీలన్నిఏకం కావాలి

గార్ల: దేశంలో కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించేందుకు బీజేపేతర పార్టీలన్నీ ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలం లోని మద్దివంచ గ్రామంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమంను ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి జనార్దన్, శ్రీనివాస్, లోకేష్, బిక్షమయ్య, శ్రీనివాస్, రాంబాబు, పుల్లయ్య, సత్ర పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని యువకుడి మృతి



మహబూబాబాద్ రూరల్ : అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని యువకుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పత్తిపాకలో శుక్రవారం చోటుచేసుకుంది. టౌన్ ఎస్సై తేజావత్ రామారావు కథనం ప్రకారం.. పత్తిపాకకు చెందిన నాయిని పద్మ కొడుకు రాజు (24) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఏడాది క్రితం అతడు ఒక బాలికను తీసుకెళ్లిన విషయంలో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై విచారణ కొనసాగుతోంది. రాజు గురువారం ఉదయం 11 గంటలకు ఫోన్‌రాగా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆ వెంటనే తల్లి ఫోన్ చేయగా రాజుకు ఎత్తలేదు. కాగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పద్మ అల్లుడు శ్రీనును వార్డు కౌన్సిలర్ జగన్ తీసుకెళ్లి గాంతి ఉపేందర్‌రెడ్డి పొలం పక్కన పొదల్లో రాజు చెట్టుకు ఉరేసుకుని చనిపోయి ఉండడాన్ని చూపించాడు. రాజు మృతిపై తమకు కందిపాటి ఉమ, కందిపాటి మానస, కొంగర కుమార్, మరి కొందరిపై అనుమానం ఉందని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతూ రాజు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

మహిళా రైతు కాలుపై నుంచి వెళ్లిన ట్రాక్టర్

కేసముద్రం: మార్కెట్‌లో మక్కలను అమ్ముకుందామని వచ్చిన ఓ మహిళా రైతు మక్కలరాశి వద్ద నిద్రిస్తుండగా, ప్రమాదవశాత్తు ట్రాక్టర్ వెనక చక్రం ఆమె కాలుపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గొట్లకొండతండాకు చెందిన లకావత్ శాంతి అనే మహిళా రైతు, పండించిన మక్కలను విక్రయించేందుకు రెండురోజుల క్రితం కేసముద్రం మార్కెట్‌కు వచ్చింది. ఈమేరకు గురువారం రాత్రి మక్కల రాశివద్ద ఆమె కాపలాగా పడుకుంది. శుక్రవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి ట్రాక్టర్‌లో తీసుకువచ్చిన వ్యవసాయోత్పత్తులను మార్కెట్‌లో పోసేక్రమంలో, ప్రమాదవశాత్తు ట్రాక్టర్ వెనకచక్రం ఆమె కాలుపైకి ఎక్కింది. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో గుర్తు తెలియని డ్రైవర్ ట్రాక్టర్‌ను ఆపకుండా వెళ్లిపోయాడు. కాలుకు తీవ్రగాయామై రక్తస్రావం అవుతుండటంతో 108లో హుటాహుటిన మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



డోర్నకల్: మహబూబాబాద్, గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం రైలు పట్టాల ప్రక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని జీఆర్‌పీ పోలీసులు గుర్తించారు. డోర్నకల్ జీఆర్‌పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్, గుండ్రామడుగు స్టేషన్ల మధ్య 439/21-22 కిలోమీటర్ నంబర్ వద్ద సుమారు 40నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన పురుషుడి మృతదేహాన్ని కనుగొన్నట్లు తెలిపారు. మృతుడు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ఉంటాడని తెలుపు రంగు షర్టు, నలుపు రంగు చుక్కలు కలిగిన బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి ఉండగా భద్రాచలంరోడ్డు, సికింద్రాబాద్ టికెట్ మినహా ఎలాంటి ఆధారులు లభ్యం కాలేదని తెలిపారు. అన్నం ఫౌండేషన్ ప్రతినిధి అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94406 27537, 94407 00030 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

దంతాలపల్లి: మండల కేంద్రంలో జరిగిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన నితిన్ బైకుపై తన మిత్రుడు మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన మధుతో కలిసి పెళ్లికి వెళ్తున్నారు. బైక్ అదుపు తప్పి గున్నెపల్లి గ్రామానికి చెందిన రైతు కృష్ణయ్య ఢీకొనటంతో ఇద్దరు వ్యక్తులకు గాయ్యాయి. కృష్ణయ్యను చికిత్స నిమిత్తం స్థానికులు తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.

కూలీ మృతి

డోర్నకల్: డోర్నకల్ శివారు రాజుతండా సమీపంలోని ఓ నిమ్మతోటలో కూలి పనులు చేస్తున్న ఓ వ్యక్తి తోటలోనే మృతి చెందాడు. రాజుతండాకు చెందిన బానోత్ సీతారాం(62) రాజుతండా సమీపంలోని నిమ్మతోటలో శుక్రవారం పనులకు వెళ్లాడు. సాయంత్రం వరకు సీతారాం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నిమ్మతోటలో వెతకగా సీతారాం విగతజీవిగా కనిపించాడు. ఘటనపై సీఐ వెంకటరత్నంను వివరణ కోరగా విచారణ చేపట్టినట్లు తెలిపారు.

డబ్బులు వసూలు చేయడం దారుణం



దంతాలపల్లి: ధాన్యం దిగుమతి చేయడానికి వెళ్లిన రైతుల దగ్గర డబ్బులు వసూలు చేయడం దారుణమని డోర్నకల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రామచంద్రనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని రేపోని గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యాన్ని మిల్లుల వద్దకు తీసుకెళ్తే డబ్బులు ఇస్తేనే దిగుమతి చేస్తాం లేదంటే ధాన్యాన్ని తీసుకెళ్లండి అని బెదిరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత మిల్లుపై చర్యలు తీసుకొని రైతుల డబ్బులు ఇప్పించి రైతులకు మేలు చేయాలని, రైతుల ధాన్యంలో తరుగు లేకుండా తీసుకునేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బట్టునాయక్, దాట్ల ఎంపీటీసీ కొమ్మినేని సతీష్,, నాయకులు పాల్గొన్నారు.